గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి

విశాలాంధ్ర - కాట్రేనికోన : చెయ్యేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయుడు గుండెపోటుతో తరగతి గదిలో కుప్పకూలిపోయాడు. ప్రతిరోజూ మాదిరిగానే ఉదయం పాఠశాల ప్రారంభమైంది. తరగతి గదిలో ఉపాధ్యాయుడు ఆకొండి బంగారయ్య(57) పాఠాలు మొదలు పెట్టారు. ఇంతలోనే ఒక్కసారిగా కుర్చీలోనే కుప్పకూలిపోయాడు. విద్యార్థుల కేకలతో తోటి ఉపాధ్యాయులు తరగతి గదిలోకి వచ్చారు. వెంటనే 108కు సమాచారం అందించగా వారు పరీక్షించి ఉపాధ్యాయుడు మృతి చెందినట్లు తెలిపారు. ఈయన స్వగ్రామం అమలాపురం. అప్పటివరకు తమతో మాట్లాడిన తోటి ఉపాధ్యాయుడు ఇకలేరని తెలియడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు.

డంపింగ్ యార్డును సందర్శించిన కమిషనర్

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల శుక్రవారం సంజయ్‌నగర్‌లోని డంపింగ్ యార్డ్ ప్రాంతాన్ని సందర్శిం చారు. ఎంహెచ్‌ఓ డాక్టర్ పృధ్వి చరణ్, డిఈ మాధవి, ఇతర అధికారులతో కలిసి అక్కడకు వెళ్లిన కమిషనర్ లెగసీ వేస్ట్ (ఎన్నో ఏళ్లుగా డంపింగ్ యార్డ్‌లో పేరుకుపోయిన అన్ని రకాల చెత్త) ప్రాసెసింగ్ ప్రక్రియను పరిశీలించారు. యంత్రాల ద్వారా అక్కడ జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. దాదాపు 3,62,375 మెట్రిక్ టన్నుల లెగసి వేస్ట్ స్వచ్ఛ్ ఆంధ్ర కార్పొరేషన్ భాగస్వామ్యంతో ప్రాసెసింగ్ ప్రక్రియ ప్రారంభించినట్లు డిఈ మాధవి కమిషనర్‌కు వివరించారు. అంతకుముందు ప్రతాప్ నగర్ ప్రాంతంలో పారిశుధ్య పనులను ఆకస్మిక తనిఖీ చేశారు. మస్తరు కేంద్రాన్ని సందర్శించి సిబ్బంది హాజరును పరిశీలించారు. సకాలంలో విధులకు హాజరయ్యారో లేదో ఆరా తీశారు . ముఖ్యంగా పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది సకాలంలో విధులకు హాజరై మెరుగైన పనితీరు కనబరిచేలా పర్యవేక్షించాలని ఎంహెచ్‌ఓ డాక్టర్ పృధ్వి చరణ్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఆయన వెంట శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ ఉద్యోగులు కూడా ఉన్నారు.

ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి

విశాలాంధ్ర - మండపేట : మండపేట పీస్ ఫుల్ టౌన్, ఇక్కడ ప్రజలు చాలా మంచివారు అని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నూతన ఎస్పీ ఎస్. శ్రీధర్ అన్నారు. ఎస్పీ బాధ్యతలు స్వీకరించిన తొలిసారిగా మండపేట టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ల రికార్డులు పరిశీలించి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీని కలిసిన మీడియాతో ఆయన మాట్లాడారు. మండపేటలో శాంతిభద్రతల పరిరక్షణకు ట్రాఫిక్ సమస్యలపై, స్టేషన్లో రిసెప్షన్ కౌంటర్ నిర్వహణ, స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారుల పట్ల మర్యాదగా వ్యవహరించడం వంటి వాటిపై పలు సూచనలు ఇచ్చినట్టు తెలిపారు. ప్రతి వార్డును ఒక పోలీసు దత్తత తీసుకుని అక్కడ ఏమైనా సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్పీ వెంట రామచంద్రపురం డీఎస్పీ బాలచంద్రారెడ్డి, మండపేట రూరల్ సీఐ పెద్దిరెడ్డి శివగణేష్, టౌన్ ఎస్ఐ మద్దాల అశోక్, ఏఎస్సై చిన్నారావు, ఇతర సిబ్బంది ఉన్నారు.

టీబీ రోగులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం ఏరియా హాస్పిటల్‌లో ముక్తభారత్-నిక్షయ్ మిత్ర వారి సహకారంతో సీఎం జగన్ ఫాలోవర్స్ టీబీ పేషెంట్లకు పౌష్టికాహార కిట్లను వైసీపీ నాయకులు వంటెద్దు వెంకన్నా యుదు అందించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌ఓ డాక్టర్ ఎం.దుర్గారావు, డిజిఎఎస్ డాక్టర్ పద్మశ్రీ, డిస్టిక్ టీబి కంట్రోల్ ఆఫీసర్ పీకే శ్రీనివాస్, సూపర్డెంట్ డాక్టర్ శంకర్రావు, నెల్లి సావిత్రి మేఘన జల్లీ సుజాత, పెట్టా సత్యనారాయణ, ఎ. తేజ, మోరం నాని, యర్రంశెట్టి ప్రసాద్, తిక్కా బాబి, అత్తిలి గణేష్, చింతలపూడి వెంకన్న బాబు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

విశాలాంధ్ర - బిక్కవోలు : ఓ యువకుడు అదృశ్యమైనట్లు బిక్కవోలు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. బిక్కవోలు మండలం అరికరేవుల గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్ మార్చి 20న ఉదయం కాకినాడ వెళ్ళి వస్తాను అని చెప్పి ఇంటికి రాలేదు. దీనితో బంధువులు చుట్టుపక్కల గ్రామాల్లో వెతికిన ఆచూకీ లభించకపోవ డంతో యువకుడు చిన్నాన్న ఫిర్యాదు మేరకు బిక్కవోలు ఎస్సై బుజ్జిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయవాదులు కొర్లమండ వీరభద్రరావు శ్రీవాణి దంపతుల సేవలు అభినందనీయం

విశాలాంధ్ర - సామర్లకోట : సుమారు మూడు దశాబ్దాలుగా సామర్లకోట పట్టణంలో న్యాయవాదులుగా, పలు సేవా కార్యక్రమాలు అందిస్తున్న కొర్లమండ వీరభద్రరావు, శ్రీవాణి దంపతుల సేవలు అభినందనీయమని లయన్స్ క్లబ్ సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఈదల ఈశ్వర్ కుమార్, తదితరులు పేర్కొన్నారు. కాకినాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రెండోసారి విజయం సాధించిన సందర్భంగా కొర్లమండ వీరభద్రరావు, శ్రీవాణి దంపతులకు సామర్లకోట శ్రీ భీమేశ్వర లయన్స్ క్లబ్లో ఘనంగా అభినందన సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ కార్యదర్శి సురేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 150 ఏళ్ళ చరిత్ర కలిగిన ప్రతిష్టాత్మకమైన కాకినాడ బార్ అసోసియేషన్‌కు రెండో సారి ఉపాధ్యక్షునిగా ఎన్నిక కావడం సామర్లకోటకు గర్వ కారణం అన్నారు. ఈ సందర్భంగా వీరభద్రరావు శ్రీవాణి దంపతులను పూల మాలలు, దుస్సాలువా మెమెంటోలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నాయకులు చిత్తలూరి వీర్రాజు (రాజా), క్లబ్ కోశాధికారి గిడుతూరి శ్రీనివాసరావు, ప్రముఖ న్యాయవాది ఎస్ఆర్‌వై అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

గంగా పుష్కరాలకు బయలుదేరిన ప్రత్యేక బస్సు

విశాలాంధ్ర - రావులపాలెం : గంగా నది పుష్కరాల సందర్భంగా రావులపాలెం ఆర్టీసీ డిపో నుంచి శుక్రవారం ప్రయాణీకులతో వారణాసికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరింది. స్థానిక బస్ స్టేషన్ వద్ద డిపో మేనేజర్ కేడిఎం ఎస్ కుమార్ ఈ బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 ఏళ్లకు ఒకసారి బృహస్పతి మేష రాశిలో ప్రవేశించినపుడు గంగా నది పుష్కరాలు వస్తాయన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 22వ తేదీ నుంచి మే 3వ తేదీ వరకు 12 రోజుల పాటు గంగానది పుష్కరాలు జరుగుతాయన్నారు. పుష్కర స్నానం చేసే భక్తుల సౌకర్యార్థం ఈ బస్సు సర్వీసు ఏర్పాటు చేసామని చెప్పారు. ఈ బస్సు అరసవిల్లి, పూరీ, కోణార్క్, భువనేశ్వర్, బాజీపూరి గిరిజదేవి శక్తి పీఠం, కలకత్తా కాళీ మాత ఆలయం, గయ మాంగళ్య శక్తి పీఠం, బుద్ధ గయ మీదుగా వారణాసి చేరుకుంటుందని తెలిపారు. 3 రోజులు అక్కడ బస చేసి పుష్కర స్నానం, వివిధ ఆలయాల సందర్శన అనంతరం సీతా మడి, అయోధ్య ప్రయోగ త్రివేణి సంగమం, నైమిశారణ్యం, చిత్ర కూట్ మీదుగా రావులపాలెం చేరుకుంటుందని చెప్పారు. ఆర్టీసీని ఆదరిస్తున్న ప్రయాణికులకు కృతజ్ఞతలు తెలిపారు.

స.హ చట్టంతో వెలుగులోకి కోవిడ్ అక్రమాలు

బాధితుల గగ్గోలు

విశాలాంధ్ర - కాట్రేనికోన : కోవిడ్ వ్యాధితో మృతి చెందిన బాధిత కుటుంబాలకు ఏళ్లు గడుస్తున్నా ఆర్థిక సహాయం అందక ఆవేదన చెందుతున్నారు. కేంద్ర ప్రభుత్వం కోవిడ్19 మృతులకు 50 వేలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించినా అర్హులైన బాధితులకు నేటికీ అందక ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అర్హులైన బాధితులు పేర్లు, దరఖాస్తులు జిల్లా కలెక్టర్, డిఎం అండ్ హెచ్‌ఓ కార్యాలయాల్లోనే గల్లంతయ్యాయి అంటే ఆశ్చర్యం కలగక మానదు. అధికారుల నిర్లక్ష్య వైఖరితో ఎక్స్‌గ్రేషియా చెల్లింపులో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కోవిడ్19లో మృతుల సంఖ్య వేలు దాటినా వందల్లోనే ఆర్థిక సహాయం అందించారు. చాలామందికి మూడేళ్లు గడిచినా పరిహారం అందలేదంటే కోవిడ్ బాధితుల దయనీస్థితి అర్థమవుతుంది. చాలామంది బాధిత కుటుంబాలు కార్యాలయాల చుట్టూ తిరగలేక విసుగెత్తి వదిలేసుకున్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా ఫిర్యాదు చేసి ఓ బాధిత మహిళ జరిగిన వాస్తవ అన్యాయాన్ని వెలుగులోకి తెచ్చింది. కాట్రేనికోన మండలం, నడవపల్లి గ్రామానికి చెందిన కొంకి సింహాద్రి 2021 మే నెల 22వ తేదీన కాకినాడ జిజిహెచ్‌లో కోవిడ్ కారణంగా చనిపోగా అతని భార్య మంగాదేవి ఎక్స్ గ్రేషియా కోసం అప్పటిలోనే దరఖాస్తు చేసుకుంది. ఇప్పటికీ ఆర్థిక సాయం అందకపోవ డంతో జిల్లా కలెక్టర్‌కు స్పందనలో మంగాదేవి దరఖాస్తు చేసుకోగా 2022 డిసెంబర్ నెల ఐదో తేదీన మీరు అర్హురాలుగా ఉన్నారు. కోవిడ్ బడ్జెట్ విడుదలైన వెంటనే మీ బ్యాంకుఖాతాలో జమ చేస్తామంటూ ఆమెకు కలెక్టర్ కార్యాలయం, కోనసీమ జిల్లా డిఎంహెచ్‌ఓ ఆఫీస్ నుండి లేఖలు అందాయి. అధికారులు ఫోన్ల ద్వారా కూడా ఆమెకు తెలిపారు. కోవిడ్ బడ్జెట్ విడుదలైనా మంగాదేవికి మాత్రం సొమ్ము జమ కాలేదు. పలుసార్లు అధికారులను అడిగినా పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో అనుమానం వచ్చిన ఆమె సమాచార హక్కు చట్టం ద్వారా తన భర్త కోవిడ్ డెత్ ఎక్స్ గ్రేషియా చెల్లింపులో ఆలస్యానికి కారణం తెలపాలంటూ, అర్హులైన బాధిత కుటుంబాలు జాబితా నకలు, ఇప్పటివరకు ఎంతమందికి కోవిడ్ ఆర్థిక సహాయం చెల్లించారు. కోవిడ్ బడ్జెట్ విడుదలైన సొమ్ము తదితరవివరాలు పంపాలంటూ కోనసీమ జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి వచ్చిన 387 దరఖాస్తుల జాబితాలో మీ దరఖాస్తు లేదంటూ సమాధానం పంపడంతో బాధితురాలు మంగాదేవి అవాక్కయింది. సమాచార దర ఖాస్తును సమాచార హక్కు చట్ట ప్రకారం కాకినాడ కలెక్టర్ కార్యాలయానికి బదిలీ చేస్తూ అర్జీ దారు అడిగిన పూర్తి సమాచారం అందివ్వాలని కోనసీమ కలెక్టర్ పంపిన ఉత్తర్వులు నకలు మంగాదేవి పంపించారు. అధికారులు ఉత్తర్వులతో దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆమె కాకినాడ కలెక్టర్ కార్యాలయం నుండి ఏ సమాచారం వస్తుందోనని ఎదురుచూస్తోంది. శుక్రవారం అధికారుల పిలుపు మేరకు కాకినాడ కలెక్టర్ కార్యాలయం వెళ్లిన బాధిత మహిళలకు మీ సొమ్ము వేరే అకౌంట్‌లో జమ అయిందని త్వరలోనే ఏ విషయం తెలియజేస్తామన్నారు. అధికారుల నిర్లక్ష్యం బాధితుల కుటుంబాలకు శాపంగా మారడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సహ చట్టం ద్వారా ఒక్క మంగాదేవికి జరిగిన అన్యాయం మాత్రమే వెలుగులోకి రాగా ఇంకా ఎంతమంది అర్హులైన బాధితకుటుంబాలకు నష్టం జరిగిందోనని ప్రతి ఒక్కరికి అనుమానం రాక తప్పదు. ఇకనైనా జిల్లా అధికారులు పూర్తి విచారణ చేసి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

విశాలాంధ్ర - రావులపాలెం : పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా రావులపాలెం సిఆర్‌సిలో ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం రాత్రి విస్తార్ విందు ఏర్పాటు చేసారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల నుంచి అధిక సంఖ్యలో ముస్లిం సోదర సోదరీమణులు పాల్గొని రంజాన్ ప్రార్థనలు చేసారు. అనంతరం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఏర్పాటు చేసిన విందు, కానుకలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత సామరస్యానికి ఇఫ్తార్ విందులు ప్రతీకలుగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎంపీపీ కర్రి లక్ష్మి వెంకట నాగదేవి, జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, ప్రజా ప్రతినిధులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ముస్లిం సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ఆలమూరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర - ఆలమూరు : మండల కేంద్రమైన ఆలమూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం ఏర్పాటు చేశారు. జాయింట్ సెక్రెటరీ మినహా మిగతావి ఏకగ్రీవమయ్యాయి. ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ ప్రాంగణంలో బార్ అసోసియేషన్ భవనంలో ఎన్నికల అధికారిగా ఎ. బిందు మాధవరావు వ్యవహరించగా ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1:30 వరకు పోలింగ్ జరిగింది. అనంతరం ఓట్లు లెక్కింపు జరిపి ఫలితాలను వెల్లడించారు. నూతన కార్యవర్గం నిమిత్తం ఎన్నికల బరిలో అధ్యక్షులుగా ఎస్విఎస్ఎస్ మూర్తి, జొన్నపల్లి సత్యనారాయణ నామినేషన్లు దాఖలు చేయగా జొన్నపల్లి తన నామినేషన్ను ఉపసంహరించుకున్నారు. ఉపాధ్యక్షుడుగా సరాకుల సత్యనారాయణ, కార్యదర్శిగా మాతా మహేశ్వరరావు, కోశాధికారిగా బి. విద్యా ప్రసన్నలు పోటీ చేయగా వీరికి ప్రత్యర్థులు ఎవరూ లేకపోవడంతో ఏకగ్రీవంగా నియమించారు. జాయింట్ సెక్రెటరీ పదవికి ఎన్నికల బరిలో జి. రాజశేఖర్, ఎ. జోగానందరావు పోటీ చేయడంతో ఎన్నికలు ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికలలో 50 మంది ఓటు హక్కుదారులు ఉండగా 38 మంది తమ ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. ఎలక్షన్ అధికారి సమక్షంలో అభ్యర్థుల ఓట్లను లెక్కించగా ఏ జోగానందరావుకి 11 ఓట్లు, జి రాజశేఖర్‌కి 27 ఓట్లు రావడంతో జి. రాజశేఖర్ జాయింట్ సెక్రెటరీ పదవిని కైవసం చేసుకున్నారని ఎన్నికల అధికారి తెలియజేశారు. ఈ సందర్భంగా గెలుపొందిన నూతన కార్యవర్గాన్ని ప్రముఖ న్యాయవాదులు, పలువురు అభినందించారు.

స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించిన ఎంఈఓ

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం చింతలూరు జడ్పీ హైస్కూల్ నందు ఆరు అదనపు తరగతి గదులు స్కూల్ నిర్మాణ పనులు, మరుగుదొడ్ల నిర్మాణం పనులు నాడు-నేడు ఫేజ్ 2 ద్వారా మంజూరు అయి పనులు జరుగుతున్న నేపథ్యంలో మండల విద్యాశాఖ అధికారి వి. రాజబాబు, సీఆర్పీ రాంజీ ప్రసాద్‌లు పనులను పర్యవేక్షించారు. స్కూల్ నిర్మాణ పనులు తొందరగా పూర్తయ్యేలాగా చూడాలని హైస్కూల్ హెచ్ఎం మధుసూదన్‌రావును కోరారు.

108లో పండంటి ఆడబిడ్డ జననం

విశాలాంధ్ర - శంఖవరం : శంఖవరం మండలం మండపం గ్రామానికి చెందిన కొల్లు నూక రత్నం(20) 108 వాహనంలోనే పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. శుక్రవారం ఉదయం గర్భిణీకి నొప్పులు రావడంతో రౌతులపూడి 108 వాహనానికి సమాచారం అందించారు. వాహనంలో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లే క్రమంలో నొప్పులు అధికం కావడంతో పిఠాపురం మార్గమధ్యలో 108 వాహనంలోనే కాన్పు అయినట్లు 108 సిబ్బంది తెలిపారు. ఈ వాహనంలో ఉన్న ఈఎమ్‌టి నోముల రాజబాబు, పైలెట్ సుధాకర్, ఆశాకార్యకర్త నాగమణి సహాయంతో ఆమె ఆడ బిడ్డకు జన్మ ఇచ్చింది. తల్లి బిడ్డను పిఠాపురం సిహెచ్‌సి ఆసుపత్రికి తరలించారు. తల్లి బిడ్డ ఇరువురు క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా

విశాలాంధ్ర - సీతానగరం : ముస్లిం సోదరులకు జనసేన నాయకులు బత్తుల దంపతులు రంజాన్ తోఫా అందించారు. మండలంలో వివిధ గ్రామాల్లో శుక్రవారం ముస్లిం సోదరులకు పవిత్ర రంజాన్ పురస్కరించుకొని జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి సుమారు 600 మందికి తోఫా అందించారు. ఈ కార్యక్రమంలో వీర మహిళ లక్ష్మి, మట్ట వెంకటేశ్వరరావు, తన్నీరు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నా భూమి నాకు ఇప్పించండి

సీపీఐ బృందంతో కలెక్టర్‌ను కలిసిన బాధితుడు

విశాలాంధ్ర బ్యూరో-రాజమండ్రి: రాజమండ్రి రూరల్ బొమ్మూరు సర్వే నెంబర్ 131 లో వున్న సప్ప గోవింద్‌రాజులు భూమిపై కొంత మంది భూకబ్జాదారులు ఎర్రమట్టి వేసారని నా భూమి నాకు ఇప్పించి వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు నాయకత్వంలో ప్రతినిధి బృందం శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ మాధవీలతను కలిసింది . సిపిఐ తో పాటు భూమి రైతు గోవింద్ రాజులూ పాల్గొన్నారు. మధు కలెక్టర్‌కు వివరిస్తూ చాలా ఏళ్ల నుండి గోవిందరావు ఆ భూమికి హక్కుదారుడిగా వున్నారని అతను తండ్రి పూర్వ జన్మ ఆస్తి కొడుకు కు ఇచ్చారని మధు తెలిపారు. ప్రభుత్వం నుండి పాస్ పుస్తకము , అన్ని ఆధారాలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం అతని భూమి తో ఆధార్ లింక్ చేసిందని వివరించారు. రెండు నెలలు నుండి కొంతమంది భూ కబ్జాదారులు ఆ స్థలంలో ఎర్రమట్టి వేసి తన స్థలం ఆక్రమిచ్చారని కలెక్టర్ కు వివరించారు. తనకు న్యాయం చేయాలని, లేకుంటే ఆత్మహత్య తప్ప మార్గం లేదని గోవింద్ రాజు వివరించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కుండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి. కొండలరావు ఉన్నారు.

వసంత కుమార్ మరణం కలచివేసింది

సీపీఐ జిల్లా కార్యదర్శి కె. సత్తిబాబు

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సీపీఎం నాయకులు కెవిపిఎస్ జిల్లా ఉద్యమ రథసారథి పచ్చి మాల వసంత కుమార్ స్థానిక కిమ్స్ ఆసుపత్రిలో వైద్యం పొందుతూ మృతి చెందారన్న విషయం సీపీఐ శ్రేణుల హృదయాలను కలచివేస్తోంది. కామ్రేడ్ వసంత కుమార్ భౌతిక కాయానికి సిపిఐ జిల్లా సమితి తరపున అంజలి ఘటించారు. సిపిఎం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాజీ కార్యదర్శి వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు శ్రీనివాసరావు, సిపిఐ అంబేద్కర్ కోనసీమ జిల్లా కార్యదర్శి కె. సత్తిబాబు, సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, సిపిఐ అమలాపురం నియోజకవర్గ కార్యదర్శి అడపా సత్యనారాయణ, దళిత హక్కుల పోరాట సమితి నాయకులు మోకా శ్రీనివాసరావు, ఊటాల వెంటేష్‌లు పాల్గొన్నారు. వసంతరావు తండ్రి పచ్చిమాల బాబ్జీకి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

వేసవిలో త్రాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు

విశాలాంధ్ర - ఏలేశ్వరం : పట్టణంలో వేసవి కాలం దృష్టిలో ఉంచుకుని త్రాగునీరు ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఏలేశ్వరం నగర పంచాయతీ చైర్పర్సన్ అలమండ సత్యవతి చలమయ్య అధికారులను ఆదేశించారు. ఈ మేరకు నగర పంచాయతీ కార్యాలయంలో కౌన్సిల్ సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ అధికారులు వార్డుల్లో కౌన్సిలర్ సహకారంతో త్రాగునీరు సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పారిశుధ్యం నిర్వహణపై అధికారులకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలకు బడ్జెట్‌ను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సమావేశంలో కౌన్సిలర్ అలమండ చలమయ్య, శిడగం త్రివేణి వెంకటేశ్వరరావు, ఎండగుండి నాగబాబు, షేక్ దిల్బర్ హుస్సేన్, వాగు బలరామ్, అధికారులు ఉన్నారు.

అగ్ని బాధితులకు సాయం

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం ఎర్నగూడెం లో ఇటీవల అగ్ని ప్రమాదానికి గురైన బాధితులు షేక్ అమీనా, కడిమి దావీదులకు ఎర్నగూడెం పంచాయతీ ద్వారా రూ. 7500 నగదు, 20 కిలోల బియ్యం అందజేయగా సొసైటీ తరపున పదివేల రూపాయల నగదు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ అగ్ని బాధిత కుటుంబాలకు తక్షణ సహాయం కింద ఈ సహాయం అందజేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పం బొంత భరత్ బాబు, సొసైటీ అధ్యక్షురాలు నరహరిశెట్టి వైదేహి, వైసీపీ నేతలు నరహరిశెట్టి రాజేంద్ర బాబు, తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE : KAKINADA

S.O.P. 4/2023

Between:

1) RAMANUJAKUTAM SITAMMA
2) RAMANUJAKUTAM VENKATA MAHESH
3) RAMANUJAKUTAM SATISH

...Petitioners

and

NIL ...Respondents

ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయునది ఏమనగా (లేటు) రామానుజకూటం బలరాం గారి భార్య రామానుజకూటం సీతమ్మ మరియు వీరి కుమారులు రామానుజకూటం వెంకట మహేష్ మరియు రామానుజకూటం సతీష్ గార్లు పై కోర్టులో సక్సెషన్ సర్టిఫికెట్ కోసం పిటీషన్ దాఖలు చేసియున్నారు. (లేటు) రామానుజకూటం బలరాం, S/o. వరదయ్య గారు షేర్స్‌లో పెట్టుబడి పెట్టి కాలం చేసినారు (మరణించిన తేది 20-12-2021). వారి లీగల్ హెయిర్స్‌కి షేర్స్ ద్వారా రావలసిన మొత్తం రూ. 7,90,000/- కొరకు పై కోర్టులో పిటీషన్ దాఖలు చేసియున్నారు.

కావున ఎవరికైనా ఎటువంటి అభ్యంతరములు ఉన్నచో **ది. 10-05-2023 సం॥ తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** పై కోర్టులో హాజరు అయ్యి అభ్యంతరములు తెలియజేసుకొనవలెను. లేని యెడల ఏవిధమైన అభ్యంతరములు లేనట్లు భావించి కోర్టువారు చేసే సక్సెషన్ సర్టిఫికెట్ జారీచేయబడునని ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము)

P. శేఖర్, అడ్వకేట్

కాకినాడ. సెల్: 93947 73859

విశాలాంధ్ర

గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

ప్రమాద బాధితులకు చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర - సామర్లకోట : రాష్ట్ర ప్రభుత్వం, ఫ్యాక్టరీ యాజమాన్యం కలసి ఒక్కో కుటుంబానికి అందిస్తున్న రూ. 50 లక్షల నష్టపరిహారాన్ని బాధిత కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీదిరి అప్పలరాజు, ఆర్ అండ్ బి మంత్రి దాడిశెట్టి రాజాలు పిలుపునిచ్చారు. శుక్రవారం కాకినాడ జిల్లా కలెక్టరేట్ కోర్టు హాలులో ఈ ఏడాది ఫిబ్రవరి 9వ తేదీన పెద్దాపురం మండలం జిరాగంపేటలో అంబటి సుబ్బన్న ఆయిల్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఏడుగురు కార్మికులు దుర్మరణం పాలైన విషయం పాఠకులకు విదితమే. డాక్టర్ అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరుకు చెందిన ఐదుగురు మృతుల కుటుంబా లకు, పెద్దాపురం మండలం పులిమేరకు చెందిన మరో రెండు కుటుంబాలు వెరసి ఏడుగురు మృతుల కుటుంబాలకు నష్టపరిహారం పంపిణీ కార్యక్రమం జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు అప్పలరాజు, దాడిశెట్టి రాజాలు మాట్లాడుతూ పరిహారాన్ని కుటుంబాల అభివృద్ధికి వినియోగించు కోవాలని దుర్వినియోగం చేసుకోవద్దని సూచించారు. ఒక్కో కుటుంబానికి 50 లక్షల రూపాయల చొప్పున నగదు డీడీలు మూడున్నర కోట్ల రూపాయలు బాధిత కుటుంబాలకు మంత్రులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కృత్తికాసుక్లా, ఎంపీ వంగా గీతా విశ్వనాథ్, ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చిన్న రాజప్ప, ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, కురసాల కన్నబాబు, పర్వత ప్రసాద్, శెట్టి పాల్గుణ, జిల్లా రెవెన్యూ అధికారి, పెద్దాపురం ఆర్డీవో జె. సీతారామారావు, తహసీల్దార్లు వజ్రపు జీతేంద్ర, సుబ్రహ్మణ్యం, శివకుమార్, మృతుల కుటుంబాలు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు పంపిణీ

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ఏలేశ్వరం ఆర్టీసీ డిపో బస్సులకు ఫస్ట్ ఎయిడ్ (ప్రథమ చికిత్స) కిట్లను శ్రీ వాణి దంత వైద్యశాల రాజమండ్రి వారి ఆధ్వర్యంలో డిపో మేనేజర్ జీవీ సత్యనారాయణకు అందజేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ ప్రయాణీకులకు అత్యవసరంగా ప్రథమ చికిత్స అందించేందుకు ప్రతి బస్సు లోను ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లో ఈ కిట్లను పెడుతున్నట్లు ఆయన తెలిపారు. సంస్థ అభివృద్ధికి ప్రయాణీకుల రక్షణకు దాతలు మరింత సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. శ్రీవాణి దంత వైద్యశాల యజమానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ డి. త్రిమూర్తులు, జీవీ రామారావు, ఎస్ఆర్ బాబు, డివిఎస్ నారాయణ, ఎ. రాజు తదితరులు ఉన్నారు.

పాఠశాలల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత

విశాలాంధ్ర - అనపర్తి : ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక మౌలిక సదుపాయాల కల్పన లక్ష్యంగా సీఎం జగన్మోహన్ రెడ్డి నాడు నేడు పథకాన్ని ప్రారంభించడం జరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారా యణ రెడ్డి అన్నారు. స్థానిక శ్రీరామారెడ్డి ప్రభుత్వ బాలుర హైస్కూల్లో నిర్మించిన వాటర్ ప్లాంట్ ఎమ్మెల్యే సత్తి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు నల్లమిల్లి మురళి, సర్పంచ్ వారా కుమారి, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి, యువ నేత మల్లిడి నితిన్ రెడ్డి, వైస్ ఎంపీపీ కర్రి ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నేత వసంత కుమార్ హఠాన్మరణం

విశాలాంధ్ర - అమలాపురం : సీపీఎం సీనియర్ నాయకుడు, కుల వివక్షత పోరాట సమితి రాష్ట్ర నాయకులు, అమలాపురం మండలం వన్నె చింతలపూడి గ్రామానికి చెందిన పశ్చిమాల వసంత కుమార్(51) గురువారం రాత్రి ఒంటిగంట సమయంలో కిమ్స్ హాస్పటల్లో మరణించారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు సంతానం. కుల వివక్ష పోరాట సమితి తరఫున ఎన్నో ఉద్యమాలు నడిపి ఎందరికో న్యాయం జరిగేలా చేసిన నాయకుడు వామపక్ష ఉద్యమాలలో చురుకైన పాత్ర పోషించే వసంత కుమార్ సీపీఎం తరుపున నడిచిన అనేక ప్రజా పోరాటాల్లో ముఖ్య భూమిక పోషించారు. నిత్యం ఏదో ఒక ఉద్యమంలో ముందుండే ప్రజా నాయకుడు హఠాన్మరణం చెందటం అందరినీ బాధించింది. వసంతకుమార్ ప్రముఖ సామాజికవేత్త పచ్చిమాల బాబ్జి తనయుడు. వసంతకుమార్ మరణంతో ఆయన కుమిలిపోతున్నారు. వసంతకుమార్ మరణం పట్ల సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, సఖిలే సూర్యనారాయణ, పాము బాలయ్య, పలువురు కార్మిక నాయకులు ఘన నివాళులు అర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కె సత్తిబాబు, పి రాము, మోకా శ్రీనివాస్ తదితరులు సంతాపం వ్యక్తంచేశారు.

రైతన్నలను విస్మరిస్తున్న ప్రభుత్వాలు

విశాలాంధ్ర - గోపాలపురం : మండ లంలో ధాన్యం త్వరితగతిన కొనుగోలు చేసి,మొక్కజొన్నకు గిట్టుబాటు ధర కల్పించాలని పీసీసీ కార్యదర్శి జేష్ట సతీష్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు మట్టపర్తి రామ్మోహనరావు ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారి బి .రాజారావుకు వినతిపత్రం అందించారు. గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి జ్యేష్ఠ సతీష్ బాబు ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వరి సాగులో మొదట రూ.1500 ధర ఇచ్చిన ప్రభుత్వం చివరకు 1100 కు తగ్గించినా పూర్తిస్థాయిలో ధాన్యాన్నికొనుగోలు చేయలేకపోయారని అన్నారు. అటువంటి తప్పిదం మరల జరగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గన్నిన రామారాయుడు, కౌలురి రత్నం రాజు,పిట్టా రామారావు,సుంకర సత్యనారాయణ,బాబాజిరావు తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం పురపాలక సంఘం కార్యాలయము

ఇ-ప్రొక్యూర్‌మెంటు టెండరు నోటీసు

ఆర్.ఓ.సి.నెం.280/2021-ఇ1, తేది : 20-04-2023

పిఠాపురం పురపాలక సంఘం MPLADS నిదుల నుండి 1 పనికి గాను అంచనా రూ. 8.50 లక్షలు 15వ ఆర్థిక సంఘ నిధుల నుండి 5 పనులకు అంచనా రూ.94.87 లక్షలు మరియు సాధారణ నిధుల నుండి 3 పనులకు గాను అంచనా రూ.8.60 లక్షలు మొత్తం పనులు వెరసి 9 పనులకు గాను రూ. 111. 97 లక్షలతో తొ ఇ- ప్రొక్యూర్ మెంటు ద్వారా ఈ క్రింది. తెలిపిన సైట్ లలో టెండర్లు కోరబడుచున్నవి. పై పనులలో 2 పనులకు షార్టు టెండర్ మరియు 7 పనులకు టెండర్ నోటీసు పిలువబడినవి. మిగిలిన వివరములు https:// tender.apeprocurment.gov.in నందు తెలుసుకొనవచ్చును.

షార్టు టెండర్

బిడ్డు డాక్యుమెంటు డౌన్‌లోడ్ ప్రారంభ తేది	: 21-04-2023 సమయం ఉదయం గం.10:00
బిడ్డు డాక్యుమెంటు డౌన్‌లోడ్ ఆఖరి తేది	: 28-04-2023 సమయం సాయంత్రం గం.05.00

టెండరు నోటీసు

బిడ్డు డాక్యుమెంటు డౌన్‌లోడ్ ప్రారంభ తేది	: 21-04-2023 సమయం ఉదయం గం.10:00
బిడ్డు డాక్యుమెంటు డౌన్‌లోడ్ ఆఖరి తేది	: 06-05-2023 సమయం సాయంత్రం గం.05.00

కమిషనరు, పిఠాపురం పురపాలక సంఘం

ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలం సి.హెచ్.అగ్రహారం, కాశిపాడు గ్రామాల్లో ఫ్రై డే డ్రై డే కార్య క్రమం ఆరోగ్య సహాయకుడు నామాల రాజు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత మన అందరి బాధ్యత అన్నారు. కనీసం వారంలో ఒక్కరోజైనా పొడి వాతరణంగా ఉంచాలని దోమలను నిర్మూలిద్దాం, పరిసరాలు పరిశుభ్రత మన అందరి బాధ్యత అని అన్నారు.దోమ కాటుకు గురికాకుండా దోమ తెరలు వాడాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు బి.దుర్గ భవాని, పి.దుర్గ, టి.వర లక్ష్మీ, కృష్ణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట పైరు సాగుతో నేల సారం పెరుగుదల

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్ : పరికోతల అనంతరం గ్రామాల్లోని రైతులు వ్యవసాయ క్షేత్రాల్లో పిల్లిపెసర, జనుము లాంటి పచ్చి రొట్ట పైరు సాగు. చేయడం ద్వారా నేల సారాన్ని సంరక్షించుకో వచ్చని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు పి. మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో 50 శాతం రాయితీతో పిల్లిపెసర, జనుము అందుబాటులో ఉంచామని తెలిపారు. రొట్టను వ్యవసాయ క్షేత్రాల్లో పెంచి అనంతరం దమ్ము చేస్తే సేంద్రీయ ఎరువుగా ఉపయోగపడి నేలలో సారం పెరుగుతుందన్నారు. మండలానికి 60.8 క్వింటాళ్ళ పిల్లి పెసర, 30 క్వింటాళ్ళ జనుము విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. కొత్తగా భూమి కొనుగోలు చేసినవారు 2023-24 సంవత్సరానికి సంబంధించి రైతు భరోసా కోసం ధరఖాస్తు చేసుకునేవారు త్వరితగతిన రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. రైతు భరోసా కేంద్రం ద్వారా సంవత్సరానికి రూ.13,500 అందిస్తుందన్నారు. ఈ నెల 29వ తేదీ లోపు రైతు భరోసా కేంద్రాల్లో అర్హత గల రైతులు సంబంధిత పత్రాలు తీసుకెళ్లి పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.

డ్రైనేజీ పనులకు భూమి పూజలు

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు గ్రామపంచాయతీ జనరల్ ఫండ్ నిధులతో 6వ వార్డులో డ్రైనేజీ పనులకు సర్పంచ్ బందారు సింధు మధుబాబు శుక్రవారం భూమి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాతూరి జనార్ధన్, వార్డు సభ్యులు మండా మరియా, కొడమంచిలి శాంతి, కార్యదర్శి కె.వి గిరిధర్, సచివాలయ సిబ్బంది కాంట్రాక్టర్ శివప్రసాద రావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రభుత్వం కట్టుబడి ఉంది

విశాలాంధ్ర -కైకలూరు : ప్రజా సమస్యల పై ప్రభుత్వం కట్టుబడి ఉందని కైకలూరు శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు అన్నారు.కైకలూరు పట్టణం లోని కైకలూరు-2 గ్రామ సచివాలయ పరిధిలోని విజయలక్ష్మి థియేటర్ ప్రాంతంలో జగనన్నే మా భవిష్యత్తు మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భముగా ఎమెల్యే దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి కొన్ని ఇళ్లకు వెళ్లి ఈ కార్యక్రమ ఉద్దేశాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అడివి వెంకట కృష్ణ మోహన్, వైస్ ఎంపిపి మహమ్మద్ జహీర్, గ్రామ సర్పంచ్ డీఎం.నవరత్న కుమారి, చైర్మన్ దండే పుష్పలత, మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు చెరుకువాడ బలరామరాజు, పిఏసీఎస్ అధ్యక్షులు పంజా రామారావు, వైస్ చైర్మన్ కొండరాజు, ఎంపీటీసీ సభ్యులు మంగినేని రామకృష్ణ, నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

జగనన్న భూహక్కు విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - గణపవరం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భూ హక్కు కార్యక్రమం విజయవంతం చేయాలని గణపవరం గ్రామ సర్పంచ్ మూరా అలంకారం అన్నారు. శుక్రవారం గణపవరం గ్రామపంచాయతీ కార్యాలయంలో జగనన్న భూ హక్కు భూ రక్ష కార్యక్రమంలో భాగంగా డ్రోన్ ఫ్లేయింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతుకు భూమీ రీ సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేసి వారికి సమగ్రమైన హద్దులతో పాస్ బుక్ ఏర్పాటు చేస్తారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో కాకర్ల విష్ణు శ్రీనివాసరావు, వైయస్సార్ పార్టీ మండల కన్వీనర్ దండ రాము, పంచాయతీ కార్యదర్శి గ్రేడ్1 దార్ల శివరాం ప్రసాద్, మూరా భాస్కరరావు, పంచాయతీ సిబ్బంది, వైఎస్ఆర్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అలరించిన వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - లింగపాలెం : ధర్మాజీగూడెంలోని హోలిట్రినిటి ఇంగ్లీషు మీడియం హైస్కూలులో శుక్రవారం జరిగిన 27వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు తల్లిదండ్రులను, అతిథులుగా వచ్చిన ఎమ్మెల్యే, అధికారులను ఆకట్టుకున్నాయి. గ్రామీణ ప్రాంతంలో ఉన్న ఈ స్కూలులో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలను ప్రతీ ఒక్కరూ ప్రశంసించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కవిత ఆధ్వర్యంలో సిబ్బంది చేసిన ఏర్పాట్లను అతిథులు అభినందించారు. తల్లిదండ్రులను పిల్లలు గౌరవించే కార్యక్రమ నిర్వహణ ఆకట్టుకుంది. వార్షికోత్సవ వేడుకలో ఎమ్మెల్యే ఎలీజా, జిల్లా విద్యాశాఖాధికారి రవిసాగర్ రిటైర్డ్ అడిషినల్ డీజీపీ పూరేటి విజయానంద్, ప్రొవిన్సిల్ సుపీరియర్ ఫాదర్ మరియ జోజి, హోలిట్రినిటి స్కూలు కరస్పాండెంట్ ఫాదర్ రాజుపాలేటి, మండల విద్యాశాఖాధికారి రామారావు తదితరులు పాల్గొన్నారు. అతిథులంతా పాఠశాల పనితీరును అభినందించారు. ఈ సందర్భంగా ఆటల్లో, విద్యలో, క్రీడల్లో, నృత్యాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం అతిథులను సత్కరించారు.

టీడీపీలో చేరిన పలువురు యువకులు

విశాలాంధ్ర-తణుకు: పట్టణంలోని యువకులు పెద్ద ఎత్తున మాజీ శాసనసభ్యులు, రాధాకృష్ణ సమక్షంలో శుక్రవారం టీడీపీలో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. లోకేష్ బాబు యువగళం పాదయాత్ర 1000కిలోమీటర్లు పూర్తచేసుకున్న సందర్భంగా స్థానిక టీడీపీ నాయకులు పితాని గణేష్, మోపిదేవి శివ, సిరిమల్లె సాంబశివరావు ఆధ్వర్యంలో తణుకు పట్టణానికి చెందిన యువకులు పెద్ద ఎత్తున టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి, మాజీ శాసనసభ్యులు రాధాకృష్ణ మాట్లాడుతూ టిడిపివైపు మొగ్గుచూపుతున్నారన్నారు. యువతను నిర్వీర్యం చేసే విధంగా రాష్టం నుంచి పరిశ్రమలను తరిమికొట్టే విధానాలను వైసిపి ప్రభుత్వం అవలంబిస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో తణుకు పట్టణ అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ, నరసాపురం పార్లమెంటు ఉపాధ్యక్షులు బసవరామకృష్ణ, టీడీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సత్ఫలితాలిస్తున్న జగనన్న శాశ్వత భూహక్కు పథకం

విశాలాంధ్ర-భీమడోలు: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పథకం సత్ఫలితాలను ఇస్తోందని భీమడోలు తహసీల్దార్ షంషుద్దీన్ అన్నారు. శుక్రవారం భీమడోలు హైస్కూల్ వేదికగా నిర్వహించిన డ్రోన్ సర్వే కార్యక్రమంలో భీమడోలు, పొలసానిపల్లి, సూరప్పగూడెం, గుండుగొలను, అంబరుపేట గ్రామాలకు సుమారు రెండు గంటల డ్రోన్ సర్వే నిర్వహించారు. సర్వేయర్ ధర్మారావు,వీఆర్వో వినయ్ కుమార్,జడ్పీటీసీ భవానీ, సర్పంచ్ లు సునీత, రహేమాబేగం, వెజ్జు బాలాజీ నాయుడు , ఎంపీటీసీలు, మండలంలోని గ్రామ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు, రెవెన్యూ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లు పునః ప్రారంభిస్తాం

విశాలాంధ్ర - గోపాలపురం : రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే అన్నా క్యాంటీన్ ను పునః ప్రారంభిస్తామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గోపాలపురం నియోజకవర్గం అభ్యర్థి మద్దిపాటి వెంకటరాజు అన్నారు. శుక్రవారం తెదేపా మండల మహిళా అధ్యక్షురాలు ఆలపాటి దుర్గా భవాని కుమార్తె మహిళా క్రికెటర్ కృష్ణ స్పందన పుట్టినరోజు సందర్భంగా అన్న క్యాంటీన్లో సుమారు 300 మంది పైగా భోజనాలు ఏర్పాటు చేశారు. మద్దిపాటి వెంకటరాజు కృష్ణ స్పందన పుట్టినరోజు కేక్ కట్ చేశారు.

అనంతరం మద్దిపాటి. వెంకటరాజు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పేదల పక్షాన పని చేసే పార్టీ అని, పేదలకు పట్టెడన్నం పెట్టే విధంగా నారా చంద్రబాబు నయుడు ఏ ఒక్కరు ఆకలితో ఉండకూడదు అనే ఉద్దేశంతో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేశారని, నేడు సైకో జగన్ మోహన్ రెడ్డి వచ్చాక అన్నా క్యాంటీన్ ను రద్దుచేసి పేదల కడుపు కొట్టాడని విమర్శించారు. గోపాలపురంలో ప్రతి శుక్రవారం అన్న క్యాంటీన్ ను తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు శక్తి వంచన లేకుండా సొంత ఖర్చులతో ఉచిత భోజనాలు ఏర్పాటు చేసి పేదల కడుపు నింపడం అభినందనీయమన్నారు .ఈ కార్యక్రమంలో కాట్రగడ్డ సురేష్ ,వడ్లమూడి రమేష్, జేష్ఠ శ్రీధర్, రాష్ట్ర సాంస్కృతిక ప్రచార కార్యదర్శి నూతంగి దొరబాబు, జేష్ఠ శ్రీనివాసరావు, దేవరపల్లినల్లజర్ల ద్వారకాతిరుమల మండల పార్టీ అధ్యక్షులు ఆండ్రు అనిల్, గన్నమని హరికృష్ణ, లంకా సత్తిపండు, కాకర్ల రామ తులసి, భూరెడ్డి వాసు,ముళ్ళపూడి దొరాజి, బ్రహ్మరాజు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలకు ఇళ్ల స్థలాల కేటాయింపు చారిత్రాత్మక నిర్ణయం

విశాలాంధ్ర- జంగారెడ్డిగూడెం: ముఖ్యమంత్రి జగన్ 31 లక్షల మంది మహిళలకు ఇళ్లస్థలాలను ఇవ్వడం ఒక చరిత్ర అని చింతలపూడి ఎమ్మెల్యే వి ఆర్.ఎలీజా అన్నారు.మండలంలోని లక్కవరం,టెక్కినవారి గూడెం పంచాయితీల లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ కార్యక్రమం గురువారం జరిగింది.ఈ కార్యక్రమానికి శాసనసభ్యులు వి.ఆర్.ఎలీజా ముఖ్య అతిథిగా పాల్గొని పట్టాలు పంపిణీ చేశారు. లక్కవరం లో 33 మందికి,టెక్కిన వారిగూడెం కు చెందిన 65 మంది లబ్ధిదారులకు జగనన్న ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో తహశిల్దార్ కే.స్లీవ జోజి,ఎంపీపీ కొదమ జ్యోతి,జడ్పిటిసి పోల్నాటి బాబ్జి టెక్కినవారి గూడెం సర్పంచ్ గురజాల ధర్మావతి పార్థసారథి, లక్కవరం సర్పంచ్ గెల్లా వెంకటరమణ, వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

విశాలాంధ్ర - నిడమర్రు: రాష్ట్ర ప్రభుత్వం పేదలు కోసం ఇచ్చిన స్థలాల్లో గృహ నిర్మాణం పనులు వేగవంతం చేయాలని నిడమర్రు మండల ప్రత్యేక అధికారి ఎం సుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం నిడమర్రు మండల పరిషత్ కార్యాలయం లో మండల ప్రత్యేక అధికారి అధ్యక్షతన వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమముల పై మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వారికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలని అన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో పి వివి ప్రకాష్, తహసిల్దార్ బి సాయిరాజ్, వ్యవసాయ అధికారి బిన్సీ బాబు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్స్, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్, తదితరులు పాల్గొన్నారు.

అప్పుల ఆంధ్ర ప్రదేశ్‌గా రాష్ట్రం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం: రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న ప్రభుత్వం అభివృద్ధిని గాలికి వదిలి అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా తయారు చేసిందని జనసేన పార్టీ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి చిర్రి బాలరాజు విమర్శించారు. పట్టణంలో శుక్రవారం ఇంటింటికి జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. చిర్రి బాలరాజు పట్టణంలో ఉన్న ప్రతి షాపును సందర్శించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో ప్రజలకు ఉపయోగపడే విధంగా ఎటువంటి మౌలిక సదుపాయాలు లేవని, డిగ్రీ కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రి, ఫైర్ స్టేషన్, ఏర్పాటుకు అధికార పార్టీ చొరవ చూపడం లేదన్నారు. సంక్షేమ పథకాల పేరు మీద ప్రజా సమస్యలను గాలికి వదిలేసారని, ముఖ్యమంత్రి జగన్ రాష్ట్ర అభివృద్ధిని విస్మరించారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు తోట వీర వెంకట సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు మాదేపల్లి శ్రీనివాస్, చెప్పుల మధుబాబు, ఏపూరి సతీష్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆపదలో వున్న వారిని ఆదుకోవటం నిజమైన మానవత్వం

విశాలాంధ్ర-టి నరసాపురం: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవటం నిజమైన మానవత్వం అని మాజీ జడ్పీటీసీ సభ్యులు నల్లూరి వెంకట చలపతి రావు అన్నారు. గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న రాజు పోతేపల్లి గ్రామానికి చెందిన చిలకా రామకృష్ణకు ఐదువేల రూపాయలు ఆర్థిక సహాయం శుక్రవారం ఆయన అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితుడికి వైద్యం నిమిత్తం తెలుగుదేశం పార్టీ అండగా వుంటుందని తెలిపారు. 28సంవత్సరాల వయసులోనే కిడ్నీ వ్యాధికి గురైన యువకుడిని ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమంలో బిసి సెల్ ఉపాధ్యక్షుడు పడమటి శివ , టిడిపి బిసి నాయకులు పేరుబోయిన సూరిబాబు, తెలుగుదేశం పార్టీ మాజీ మండల తెలుగు రైతు అధ్యక్షులు ఘంటా సతీష్, దవులూరి కృష్ణ, మాజీ సర్పంచ్ గుమ్మళ్ళ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విఆర్ రావు జయంతి

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పి మల్లవరం గ్రామానికి చెందిన విఆర్ రావు జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు, పి.మల్లవరం గ్రామానికి చెందిన వుంగరాల రామచంద్రరావు (విఆర్ రావు) రెండవ జయంతి సందర్భంగా కుమారుడు రవీంద్ర ఆధ్వర్యంలో ఆయన గృహంలో చిత్రం పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో నిరుపేద ఒంటరి కుటుంబ సభ్యులు వంద మందికి భోజనం పొట్లాలు మరియు మజ్జిగ ప్యాకెట్లు మరియు పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వుంగరాల వెంకటేశ్వరరావు, ధూళిపూడి సుబ్బారావు, వుంగరాల బద్ర, కృష్ణ, చంద్రశేఖర్, శ్రీలక్ష్మి, ధూళిపూడి వెంకటరమణ (బాబి), దున్నా సుబ్రహ్మణ్యం, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కిట్ల పంపిణీ

విశాలాంధ్ర-దేవరపల్లి: ముస్లింల పవిత్ర రంజాన్ పండుగ పురస్కరించు కొని దేవరపల్లితెలుగుదేశం నాయకులు గన్నమని హరికృష్ణ జీకే యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం దేవరపల్లి మసీదులో ముస్లిం సోదరులకు రంజాన్ సరుకుల గల కిట్లను అందజేశారు. అంతకుముందు గన్నమని హరికృష్ణ దేవరపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆండ్రు అనిల్ ముస్లిం సోదరులతో కలిసి నమాజ్ చేశారు. అనంతరం సుమారు 100 కుటుంబాలకు తోఫా కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నేతల యాగంటి వెంకటేశ్వరరావు, ఉప్పులూరి రాంబాబు, కొట్టూరు ధ్రువకాంత్ , ముల్లపూడి సత్యనారాయణ, పోలుమాటి రామకృష్ణ, జీకే యూత్ సభ్యులు పాల్గొన్నారు. ముస్లిం సోదరులు ఖాదర్ రోషన్, గౌస్ భాష దేశం నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్ఫర్మేషన్‌పై 29 లోపు సర్వే పూర్తి చేయాలి

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలో పాఠశాలలో సామాజిక తనిఖీపై ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు పాఠశాల సామాజిక తనిఖీపై మండల విద్యాశాఖాధికారి పివి ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన శిక్షణా తరగతులకు ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల అభివృద్ధి అధికారి నాతి బుజ్జి మాట్లాడుతూ పాఠశాల మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ఎంతో తోడ్పడుతుందని అన్నారు. పాఠశాల అభివృద్ధిలో ఉపాధ్యాయులతో పాటు పేరెంట్స్ కమిటీ భాగస్వామ్యంతో పాఠశాలను అభివృద్ధి చేయాలని సూచించారు. జిల్లా ఏఎల్ఎస్ కో ఆర్డినేటర్ రమేష్ బాబు మాట్లాడుతూ "సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్ఫర్మేషన్" అనే కార్యక్రమం (ఎస్ఏఎల్‌టి)లో ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ, మరియు విద్యార్థులు 'స్కూల్ పర్ ఫార్మేన్స్ యాప్ ద్వారా ఈనెల 29 లోపు సర్వే పూర్తి చేయాలన్నారు. నాడు నేడు మొదటి దశకు ముందు పాఠశాలలు ఏవిధంగా ఉన్నాయో యాప్ ద్వారా అప్లోడ్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ సూర్య లక్ష్మీ, కృష్ణ కాంత్, ప్రధానోపాధ్యాయులు జ్యోతిబసు, శ్రీనివాస్, వంశీకృష్ణ, ప్రసాద్, సిఆర్‌పిలు ఆత్మారావు, జాన్, సధాకర్, ఎమ్ఐఎస్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు

మా నమ్మకం నువ్వే జగన్ మా భవిష్యత్తు నువ్వే

విశాలాంధ్ర - కరప : కరప మండలం పెదకొత్తూరు, యండమూరు గ్రామాలలో శుక్రవారం మాజీ మంత్రివర్యులు కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి జగనే మా భవిష్యత్తు అనే కార్యక్రమాన్ని నిర్వహించుట జరిగింది.

ప్రతి ఇంటికి వెళ్లి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు అందుతున్నది లేనిది అడిగి తెలుసుకుని వారి సమస్యలను పరిష్కరించడం జరిగిందని కన్నబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెంకి శ్రీలక్ష్మి సత్తిబాబు, జడ్పిటిసి వై సుబ్బారావు, వైసీపీ మండల అధ్యక్షులు చింత ఈశ్వరరావు, వైస్ ఎంపీపీ రాఘవులు పెదకొత్తూరు గ్రామ సర్పంచ్ నాగలక్ష్మి బుజ్జి, యండమూరి గ్రామ సర్పంచ్ మారెళ్ళ శ్రీనివాసరావు, విజయ రాయుడుపాలెం గ్రామ సర్పంచ్ సీతారామరాఘవ, కాదా వెంకటేశ్వరరావు, మారేళ్ల వెంకటరమణ, వడ్డపాటి గోపి, రెడ్డి శ్రీను, గృహ సారధులు, వాలంటీర్లు, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

29న టీడీపీ ఆధ్వర్యంలో అఖిలపక్ష బీసీల సమావేశం

విశాలాంధ్ర - కాకినాడ : ఈ నెల 29న కాకినాడ పార్లమెంటుపరిధిలోని బీసీ నాయకులతో అఖిలపక్ష సమావేశం కాకినాడ సూర్యకళామందిరంలో నిర్వహిస్తున్నట్టు టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కాకినాడలో జరగనున్న బీసీ నాయకుల అఖిలపక్ష సమావేశానికి వైసీపీ మినహా అన్నిపార్టీల నాయకులను ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. బీసీలకు రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయంతో పాటు రాబోయే కాలంలో పార్టీ పరంగా వారిని ఆదుకునేలా కార్యాచరణ ఉంటుందన్నారు. ఈ సమావేశానికి టీడీపీ తరపున అచ్చెన్నాయుడు, అయ్యన్నపాత్రుడు, బండారు శ్రీనివాసరావు, కొల్లు రవీంద్ర తదితరులు పాల్గొంటారన్నారు. 5 పార్లమెంటుల్లోని ముఖ్యనాయకులు 7 నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు హాజరై రాష్ట్రప్రజల ఇబ్బందులు, రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, అన్యాయంపై సమావేశంలో చర్చిస్తారన్నారు. నారా లోకేష్ యువగళం పాదయాత్ర 1000 కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు చప్పిడి వెంకటేశ్వరరావు, కోర్పు సాయితేజ, తూము కుమార్ తదితరులు పాల్గొన్నారు.

24న జీ తెలుగులో 'రాధకు నీవేరా ప్రాణం' సీరియల్

విశాలాంధ్ర-రాజమండ్రి: జీ తెలుగు ఛానల్ లో రెండు విభిన్న హృదయాల మధ్య సాగే సరికొత్త ప్రేమకథాంశంతో రూపొందుతున్న 'రాధకు నీవేరా ప్రాణం' సీరియల్ ఈ నెల 24 న ప్రారంభం కానుందని ఆ ఛానల్ ప్రతినిధి చెప్పారు. ఓ చిత్రకారిణి, ఓ పోలీసు అధికారి మధ్య సాగే ప్రణయగాథనే ఈ సీరియల్. ఇద్దరి జీవితాల్లో ప్రమాదం రూపంలో విధి నడిపించే కథతో సాగే ఈ సీరియల్ జీ తెలుగు ప్రేక్షకులకు దగ్గరవ్వబోతుందన్నారు. తన అభిరుచిని సానబెడుతూ మంచి కళాకారిణిగా రాణిస్తూ కుటుంబ బాధ్యతలతో సాగిపోతున్న రాధిక జీవితం ప్రమాదం బారినపడి ఏమైపోయింది?, హాయిగా సాగిపోతున్న ఓ పోలీసు అధికారి జీవితంలో సంభవించిన పెనుప్రమాదం అతనిని ఎలా మార్చింది? మోడువారిని అతని మనసుని ప్రేమ ఎలా కరిగించింది? ఈ భిన్న ధ్రువాల మధ్య ప్రేమ ఎలా వికసిస్తుంది? అనే అంశాలు 'రాధకు నీవేరా ప్రాణం' లో ఉన్నాయన్నారు. ఈ సీరియల్లో నిరుపమ్ పరిటాల, గోమతి ప్రియ జంటగా నటిస్తుండగా, చైత్రా రాయ్ కీలకపాత్రలో కనిపించనున్నారన్నారు. 'రాధకు నీవేరా ప్రాణం', ఈ నెల 24న ప్రారంభం అయ్యి, సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు రాత్రి 7:30 గంటలకు, జీ తెలుగులో ప్రసారం కానుందని, ఆదరించాలని కోరారు.

టేకిలో వైభవంగా ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం టేకి గ్రామంలో కొలువైయున్న ముత్యాలమ్మ అమ్మవారి జాతర, మహోత్సవ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాత్రి గరగ నృత్యాలు, శక్తి వేషాలు, విచిత్ర వేష ధారణలతో భాజా భజంతులతో బాణాసంచా కాల్పులతో వైభవంగా నిర్వహించారు. శుక్రవారం వేకువ జాము నుండి గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని ముడుపులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ ఉత్సవాల్లో ఆలయకమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అసమర్ధత మంత్రి ఆదిమూలపు సురేష్

విశాలాంధ్ర -కైకలూరు : రాష్ట్రంలో జగన్ రెడ్డి మంత్రి వర్గంలో మంత్రి ఆదిమూలపు సురేష్ తన పరిపాలనలో అసమర్ధతను కప్పిపుచ్చుకునేందుకే మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను అడ్డుకునేందుకు దళితులను అడ్డుపెట్టుకున్న అసమర్ధుడని తెలుగుదేశం పార్టీ నాయకులు వీరాబత్తిన సుధ,తేరా రమేష్,ఈదా వెంకటస్వామి,సదర్ల సూరి,కురేళ్ళ ఏడుకొండలు,బళ్ళ రాజు, పళ్ళెం తాతారావు,నెరేళ్ళ వంశీ కృష్ణ లు విమర్శించారు.ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం లో నిర్వహిస్తున్న ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న నారా చంద్రబాబునాయుడు పర్యటన ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నందుకు తట్టుకోలేక దళితులను అడ్డుపెట్టుకొని చిల్లర రాజకీయాలు చేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్ చేష్టలను రాష్ట్ర ప్రజలందరూ గమనిస్తున్నారని అన్నారు.అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి దళితుల 27 సంక్షేమ పథకాలు రద్దు చేసినప్పుడు మాట్లాడని మంత్రి సురేష్ తన సొంత నియోజకవర్గంలో దళితుల్ని రెండు మూడు గ్రూపులుగా విడగొట్టి అంబేద్కర్ ఆశయాలకు తూట్లు పొడిచిన మంత్రి ఆదిమూలపు సురేష్ దళిత ద్రోహి కాదా అని ప్రశ్నించారు. దళితులు అభివృద్ధికి కృషి చేసిన మహనీయుడు చంద్రబాబునాయుడు అన్నారు. అలాంటి వ్యక్తిపై బుడదల్లే కార్యక్రమం పెట్టుకున్న వైయస్సార్ సిపి ఇకనైనా ఆపి రాష్ట్ర ప్రజలకి మంచి చేసే విధంగా వ్యవహరించాలని అన్నారు.

ఏఐవైఎఫ్ కు ఎక్సైజ్ అధికారి హామీ

విశాలాంధ్ర - విజయవాడ : వేకువజామున మద్యం షాపు తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఐవైఎఫ్‌కు ఎక్సైజ్ అధికారి హామీ ఇచ్చినట్లు ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి బెవర శ్రీనివాసరావు తెలిపారు. మార్చి 28 న చిట్టినగర్ సెంటర్లోలోనూ, మరోసారి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఆఫీస్ దగ్గర ఉదయం 5 గంటలకే బార్లు తీస్తున్నారని నిరసన కార్యక్రమాలు చేపటిన్ట అనంతరం కలెక్టర్ ఢిల్లీ రావు, ఎక్సైజ్ శాఖ అధికారి ఎస్సై యనమల ఈశ్వర్ రావులను బార్లు పై చర్యలు తీసుకోవాలని కోరటం జరిగిందని గుర్తు చేశారు. కలెక్టర్ అదేశానుసారం వారం రోజుల్లో బార్లు, వైన్ షాపులపై తనిఖీలు నిర్వహిస్తామని విజయవాడ నగర యువజన సమైక్య అధ్యక్ష కార్యదర్శులు కాళ్ల విజయ్, బెవర శ్రీనివాసరావులకు హామీ పత్రం అందించారు.

పౌరులకు ఉత్తమసేవలందించాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం : పరిపాలనా వ్యవస్థకు మూల స్థంబాలుగా వ్యవహరిస్తూ పౌరులకు ఉత్తమ సేవలు అందించడమే సివిల్ సర్వెంట్ల లక్ష్యమని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. శుక్రవారం జాతీయ పౌర సేవల దినోత్సవం (నేషనల్ సివిల్ సర్వీసెస్ డే) పురస్కరించుకుని స్పందన సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, జాయింట్ కలెక్టర్ డా. అపరాజితసింగ్తో కలసి అధికారులచేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పౌరులకు సేవ చేయడం కోసం సివిల్ సర్వెంట్లు తమను తాము తిరిగి అంకితం చేసుకునేందుకు, ప్రజాసేవ, పనిలో శ్రేష్టతను వారి కట్టుబాట్లను పునరుద్ధరించడానికి ప్రతి సంవత్సరం ఏప్రిల్ 21న సివిల్ సర్వీసెస్ డేని భారత ప్రభుత్వం జరుపుకుంటుందన్నారు. 1947లో స్వతంత్ర భారత దేశపు మొదటి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ ఆఫీసర్ల ప్రొబేషనర్లను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వంలోని వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న సివిల్ సర్వెంట్లు దేశ పరిపాలన వ్యవస్థకు మూల స్థంబాలుగా వ్యవహరిస్తారు అన్న ఆయన మాటలను ఈ సందర్భంగా కలెక్టర్ గుర్తు చేశారు. ఆయన మాటలను స్ఫూర్తిగా తీసుకుని పౌరులకు సేవలు అందించడంలో ఎలాంటి తారతమ్యం చూపకుండా, అవినీతిరహిత సేవలు అందించడానికి అధికారులు నిత్యం కృషి చేయాలని కోరారు. ఈ కార్య క్రమంలో ఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ చైతన్య, వివిద శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు జవాబుదారీగా ఉండండి

విశాలాంధ్ర-పెడన: అధికారులందరూ నిరంతరం ప్రజలకు జవాబు దారితనంగా ఉండాలని, ప్రజల సమస్యలు తీర్చడంలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించరాదని మంత్రి జోగి రమేష్ సూచించారు. పెడన పట్టణ మార్కెట్ యార్డ్ సమావేశ మందిరం నందు కృత్తివెన్ను మండలానికి చెందిన రెవెన్యూ, గ్రామీణ, మంచినీటి సరఫరా, పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖ, హౌసింగ్, విద్యుత్ శాఖ, మత్స్యశాఖ, వ్యవసాయ శాఖ, ఇరిగేషన్ తదితర కీలక శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది మరియు కృత్తివెన్ను మండల ప్రజా ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మంత్రి జోగి.రమేష్ పై విధంగా పేర్కొన్నారు. ముఖ్యంగా వేసవికాలం దృష్టిలో పెట్టుకొని ప్రజలకు స్వచ్ఛమైన మరియు సురక్షిత మంచినీరు అందించే విధంగా అన్ని రకాల చర్యలు చేపట్టాలని మంత్రి గ్రామీణ మంచినీటి సరఫరా అధికారులను మరియు సిబ్బందిని ఆదేశించారు. తీర ప్రాంత గ్రామాల్లో ప్రజలు ఎవరు కూడా దాహార్తితో బాధపడకూడదు అని అలాంటి సమస్యలు మరలా తన దృష్టికి వస్తే అధికారులు బాధ్యత వహించాల్సి వస్తుందని మంత్రి స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశం మార్కెట్ యార్డ్ చైర్మన్ కొల్లాటి గంగాధరరావు, జడ్పిటిసి మైలా రత్నకుమారి, మండల పార్టీ అధ్యక్షుడు వైదాని వెంకటరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లా.సూరిబాబు సచివాలయాల మండల కన్వీనర్ కొక్కిల గడ్డబాబ్జి, వ్యవసాయ సలహా మండలి సభ్యుడు వల్లబు బాబురావు, నాయకులు పాల్గొన్నారు.